క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



కలెక్టరేట్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఆడపిల్లలు గల మహిళా అధికారులచే మొక్కలు నాటించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. మొక్కలు పెంచడం వల్ల ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పి.శారద, పౌర సరఫరాల సంస్థ డీఎం వి.శ్రీలక్ష్మి, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్ఓ ఆర్.మాలిని, డీసీపీఓ సూర్యచక్రవేణి, డ్వామా ఏపీడీ శ్రీదేవి, ఐసీడీఎస్ విస్తరణ అధికారి మల్లిక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వెంకన్న చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ తెలిపారు. నగరంలోని జ్వాలాపరమేశ్వర కాలనీ, పెద్దదేవుడి గుడి, చోడే వెంకటరత్నం వీధి, దక్షిణపు వీధి, పోణంగి రోడ్డు, మార్కండేయ స్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ నిర్ణయం వద్దు

ఏలూరు (టూటౌన్): స్థానిక గజ్జలవారి చెరువు వద్ద చేపలు, కూరగాయల మార్కెట్ వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని బీఎస్పీ నాయకులు నేతల రమేష్ బాబు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. చేపల మార్కెట్‌లో ఒకటి, గజ్జలవారి చెరువు దక్షిణపు వైపు మరొకటి, మార్కెట్‌కు అత్యంత దగ్గరలో పెద్ద వంతెన పక్కనే ఇంకొక సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నట్టు తెలిపారు. ఇన్ని ఉండగా, మార్కెట్‌లో రాకపోకలు సాగించడానికి వాహనాలు నిలుపు కోవడానికి ఉపయోగపడే స్థలంలో మరో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలన్న నగరపాలక సంస్థ నిర్ణయం కాంట్రాక్టర్‌కు మేలు చేసేదిగా ఉందని పేర్కొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పరీక్షలు రాయనున్న 4714 మంది విద్యార్థులు
- గత ఏడాది ఏలూరు నియోజకవర్గానికి 10వ స్థానం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమైంది. భవిష్యత్తులో ఉన్నత చదువులకు మొదటి మెట్టులాంటి పది పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. మరో పది రోజుల్లో అంటే ఈనెల 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. చదవడంతో పాటు నిర్ణీత సమయంలోపు ప్రశ్నలకు జవాబులు రాయడం ఎలాగో నేర్పిస్తున్నారు. గతంలో వచ్చిన ప్రశ్నలను ఏర్చి కూర్చి ఈ ఏడాది వచ్చే ప్రశ్నలను అంచనా వేసి విద్యార్థులకు ఆయా ప్రశ్నలు, సమాధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి నిపుణులైన ఉపాధ్యాయులతో మెళకువలను నేర్పిస్తున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కేటగిరీల వారీగా విభజిస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు

ఈ ఏడాది ఏలూరు నియోజకవర్గం నుంచి 4714 మంది విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో ఏలూరు అర్బన్ పరిధిలోని 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1399 మంది, 31 ప్రైవేట్ పాఠశాలల నుంచి 2208 మంది విద్యార్థులు ఉన్నారు. రూరల్ మండలంలో 10 ప్రభుత్వ పాఠశాలల నుంచి 610 మంది, 8 ప్రైవేట్ పాఠశాలల నుంచి 397 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ స్థాయిల్లో నిర్వహించిన పరీక్షల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎ కేటగిరీలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బి కేటగిరీ విద్యార్థులు అత్యధిక మార్కులు, సి కేటగిరీ విద్యార్థులు కనీసం ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు అడుగులు వేస్తున్నారు.

గత ఏడాది ఉత్తీర్ణత ఇలా..

గత ఏడాది 10వ తరగతి ఫలితాల్లో జిల్లాలోని 28 మండలాల్లో ఏలూరు అర్బన్, రూరల్ మండలం (మొత్తం నియోజకవర్గం) కలిపి 10వ స్థానంతో సరిపెట్టుకుంది. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం 82.84 శాతంగా నమోదయింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 1966 మంది బాలురు పరీక్షలు రాయగా 80.93 శాతంతో 1591 మంది, 2,201 మంది బాలికలు పరీక్షలు రాయగా 84.55 శాతంతో 1861 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆత్మస్థైర్యం పెరిగింది



ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. ఏదైనా సందేహం ఉంటే నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు. మాకు ఇచ్చిన స్టడీ మెటీరియల్‌తో ముఖ్యమైన ప్రశ్నలను తెలుసుకుని వాటిని చదవడంతో ఆత్మస్థైర్యం పెరిగింది. ఒత్తిడిని ఎలా అధిగమించాలో మా సార్లు చెబుతున్నారు.

– ఎ.నవీన్, విద్యార్థి, జెడ్పీ హైస్కూల్, శనివారపుపేట

ఉత్తీర్ణతపై నమ్మకం



తోటి విద్యార్థులు ఎంతో శ్రద్ధగా చదువుతుంటే ఇతర విద్యార్థుల్లో కూడా పోటీ తత్వం పెరుగుతోంది. వారికంటే బాగా చదవాలని, వారికంటే ఎక్కువ మార్కులు సాధించాలనే కసి వస్తోంది. ఆకలి దప్పులు తెలియకుండా మధ్యలో స్నాక్స్ కూడా అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. మంచి మార్కులతో పాసవుతమనే నమ్మకం కలుగుతోంది.

– పి.లోహిత్, జెడ్పీ హైస్కూల్, శనివారపుపేట

వెనుకబడిన వారిపై దృష్టి



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. వారి కోసం ప్రత్యేక తరగతుల్లో కొందరు ఉపాధ్యాయులను కేటాయించాం. వెనుకబడిన విద్యార్థుల చేత ఒకటి పదిసార్లు చదివిస్తూ, చదివినవి పేపర్‌పై రాయిస్తూ ప్రాక్టీస్ చేయిస్తున్నాం. పరీక్షల్లో ఎటువంటి తత్తరపాటుకు గురికాకుండా ఉండేలా వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నాం.

– డీవీ రమణ, ఎంఈఓ–2, ఏలూరు

11న చలో విజయవాడ



మాట్లాడుతున్న సుబ్బారాయుడు

ఏలూరు (టూటౌన్): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు కోరారు. స్థానిక స్ఫూర్తి భవనంలో ఆయన గురువారం మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికులకు భద్రత కల్పించాలని, వేతనాలను మున్సిపల్ శాఖ నుండే చెల్లించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెరుగుదలపై సమ్మె నాటి ప్రభుత్వ ఒప్పందం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో మున్సిపల్ వర్కర్ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూన పాముల విగ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడారు. నాయకులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, బండి వెంకటేశ్వరరావు, తొర్లపాటి బాబు, ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



అల్పాహారం అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఏలూరు (టూటౌన్): మాలధారణ దీక్షాపరులకు స్థానిక గ్రేట్ ఫుల్ గిఫ్ట్ సొసైటీ సభ్యులు గురువారం సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద సెయింట్ మైఖేల్ ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో 40 రోజుల మాలధారణతో సిలువ ధ్యాన ప్రార్థనలు చేసే వారికి ఉదయం 7 గంటలకు దివ్యబలి పూజ అనంతరం రెవరెండ్ ఫాదర్ దిరిసిన ఆరోను జపమాలలు వేసి ఆశీర్వదించారు. సాయంత్రం మాలధారణ దీక్షాపరులు సుమారు 300 మందికి గ్రేట్ ఫుల్ గిఫ్ట్ సొసైటీ సభ్యులు అల్పాహారం అందజేశారు. సొసైటీ అధ్యక్షులు సొంగా మధు, జాయింట్ సెక్రెటరీ యర్రా జయదాస్, ట్రెజరర్ పావని జ్యోతి, బాలరాజు, ఏవీ ఆనంద్ పాల్గొన్నారు.

వాటర్ లేని ఫౌంటెయిన్లు



తంగెళ్లమూడి సెంటరులో..



జూట్‌మిల్లు సెంటరులో వాటర్ ఫౌంటెయిన్



అశోక్‌నగర్ సెంటర్‌లో..

వైఎస్సార్ సీపీ హయాంలో సుందరీకరణలో భాగంగా ఏలూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో వాటర్ ఫౌంటెయిన్స్ నిర్మించారు. వీటి ప్రారంభం ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటర్ ఫౌంటెయిన్లను ప్రారంభించింది. ఇవి విద్యుత్ కాంతుల్లో వాటర్ సౌండ్స్‌తో కళకళలాడేవి. అనంతరం అవి రెండు నెలల నుంచి కళతప్పి కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

ద్వారకాతిరుమలకు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు డిపో నుంచి వెంకటకృష్ణాపురం మీదుగా ద్వారకాతిరుమల కొండపైకి నడిపే ఆర్టీసీ బస్సు సర్వీసును గురువారం ఉదయం స్థానిక కొత్త బస్టాండులో ఆర్టీసీ విజయవాడ జోన్–2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం 8.40, మధ్యాహ్నం 1 గంటకు ఏలూరు కొత్త బస్టాండులో బయలుదేరి ద్వారకతిరుమల చేరుకుంటుందని, ఉదయం 10.30, మధ్యాహ్నం 3 గంటలకు ద్వారకతిరుమలలో బయలుదేరి ఏలూరు చేరుకుంటుందని తెలిపారు. అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం ఆగిపోయిన ఈ సర్వీసును పునరుద్ధరించామని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఏఎంటీ జి.మురళి, ఎంఎఫ్ ఐ.ప్రేమ్ కుమార్, పీఆర్ఓ కేవీఎల్ నరసింహం, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ప్లానుకు అనుగుణంగానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని టౌన్, కంట్రీ ప్లానర్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారిన మార్గదర్శకాలకు అనుగుణంగా భవన నిర్మాణాలకు మున్సిపాల్టీల అనుమతులు అవసరం లేదని చెప్పారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూపొందించిన ప్లానుకు అనుగుణంగా భవనాలు నిర్మించుకోవచ్చన్నారు. నిర్మాణాలు అందుకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా పనిచేయాలని కోరారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ అధికారి కె.సత్యమూర్తి మాట్లాడారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ అధికారులు బి.సుధాకర్, ఎన్ సురేఖ, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీరాణి, ఏలూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.శ్రీనివాస్, భీమవరం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం శ్రీలక్ష్మి, వార్డు సచివాలయ సర్వేయర్‌లు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	34	బీళ్ల చిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	72
కాకర కాయలు	34	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10–12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	34	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	40
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	11
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.0	4830	34

భీమడోలులో ట్రాఫికర్

- ఇరుకు రోడ్లు, ఆపై పార్కింగ్ కష్టాలు
- ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య జటిలం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- వైఎస్సార్ సీపీ హయాంలో పరిష్కారానికి చర్యలు



భీమడోలు సంతలో తప్పుకునేందుకు వీలులేని ప్రధాన రోడ్డు



రైలు వెళ్తుంటే భీమడోలు వైపుగా నిలిచిన వాహనాలు

భీమడోలు: ఇరుకు రోడ్లు, ఆపై పార్కింగ్ సమస్యలతో భీమడోలులో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. స్థలాల ధరలు ఆకాశన్నంటడంతో రోడ్లు, డ్రెయినేజీలను సైతం ఆక్రమించి వాహనాల పార్కింగ్‌కు స్థలం వదలకుండా భవనాలను నిర్మించుకోవడం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారింది. రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ భీమడోలు మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వైపు వెళ్లే ప్రధాన రహదారి ఆక్రమణలతో కుచించుకుపోయింది. బుధవారం వారపు సంతలోనూ రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధాన సమస్యలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేడు.

రద్దీగా సంత మార్కెట్ మార్గం

భీమడోలులో బుధవారం వారపు సంతకు 50 గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. తోపుడు బండ్లు, కూరగాయల తాత్కాలిక దుకాణాలు ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డుపైనే నిర్వహిస్తుంటారు. రహదారిపై రైతులు, వ్యాపారుల వాహనాలు గంటల కొద్దీ నిలిపి ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. మరోవైపు వడ్లపట్ల వైపు మాంసం దుకాణాల ఏర్పాటుతో ఎదురెదురుగా ఒకరికొకరు తప్పుకునేందుకు అవకాశం ఉండదు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలు, ఆర్టీసీ బస్సులు సంత మార్కెట్ మార్గంలోనే రాకపోకలు సాగించాలి. జాతీయ రహదారి భీమడోలు వద్ద రైల్వే గేటు వేసి తెరిస్తే వందలాది వాహనాలు ఒక్కసారిగా సంత మార్కెట్ మార్గంలోకి వస్తుంటాయి. దీంతో ఈ మార్గం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది.

వైఎస్సార్ సీపీ హయాంలో షెడ్ల నిర్మాణం

భీమడోలు సంత మార్గంలో ప్రజలు పడుతున్న కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ చొరవతో నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో రెండు షెడ్ల నిర్మాణానికి నాబార్డ్ నిధులు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఒక షెడ్డు నిర్మించారు. మరో షెడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ షెడ్లు అందుబాటులోకొస్తే కొంత సమస్య తీరనుంది.

జాతరకు వేలాదిగా వాహనాలు

12 ఏళ్లకు ఒకసారి వచ్చే భీమడోలు గ్రామ దేవతలు మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల నెల రోజుల జాతర ఉత్సవాలు ఈ నెల 8, 9వ తేదీల్లో ముగియనున్నాయి. ఈ రెండు రోజుల్లో గ్రామానికి వివిధ రాష్ట్రాల్లో ఉన్న బంధువులు రానున్నారు. గ్రామంలో 2.5 లక్షల వరకు జనం వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలాదిగా వచ్చే వాహనాలను ప్రైవేటు స్థలాల్లో భద్రపర్చుకోవాలని జాతర కమిటీ సూచిస్తోంది. భీమడోలు రైల్వే గేటు నుంచి గణపతి సెంటర్ మీదుగా సంత మార్కెట్ వద్ద గల అమ్మవార్ల ఆలయాల వరకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని, దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించాలని కొందరు పెద్దలు జాతర ఉత్సవాల ప్రారంభంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

పంచాయతీ ప్రత్యేక దృష్టి



భీమడోలు సంత మార్కెట్, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సంత మార్కెట్ కార్యకలాపాలపై పంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది. ఏన్నో ఏళ్లుగా రోడ్డుపై సాగుతున్న సంతను వారికి కేటాయించిన లోపల వైపుకు మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నాబార్డ్ నిధులతో చేపట్టిన రెండు షెడ్లు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది. గ్రామీణ ప్రాంత రైతులు, వినియోగదారులకు ఈ షెడ్ల వద్ద ప్రయోజనం చేకూరుతుంది.

– పాము సునీతామాన్‌సింగ్, సర్పంచ్, భీమడోలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



సంత మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఎక్కువ వాహనాలు నిలవకుండా అవగాహన కల్పిస్తున్నాం. సంత మార్కెట్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని చెబుతున్నాం. జాతరకు వచ్చే వేలాది వాహనాలన్నీ ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ చేసుకునేలా నిర్ణయించాం. మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– వై.సుధాకర్, ఎస్సై, భీమడోలు

8న మహిళా సాంస్కృతిక సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న మహిళా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీలు తెలిపాయి. ఈ మేరకు స్థానిక అన్నే భవనంలో బ్రోచర్, ఫ్లెక్సీలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు రామకృష్ణపురంలోని సాహిత్య మండలి భవనంలో మహిళలకు ప్రతిభా పోటీలు, చైతన్య సదస్సు, శ్రామిక మహిళలకు సత్కారాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పి.కస్తూరిబాయి, వి.సాయి సుధ మాట్లాడుతూ ఫ్రం వేస్ట్, పేపర్ క్రాఫ్ట్, అంతర్జాలంలో అన్వేషణ, సామెతలు, మహిళా అభ్యుదయ పాటలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో నిరుద్యోగ యువతకు షార్ట్‌టర్మ్ శిక్షణలో భాగంగా హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, పదో తరగతి, ఆపైన చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులకు ఈనెల 15 వ తేదీ వరకు గడువు ఉందని, మరిన్ని వివరాలకు సెల్ 94934 82414 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల వితరణ

దెందులూరు: గారపాటి హైమావతి దేవి హైస్కూల్‌కు 1985–86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు రూ.30 వేలు విలువ చేసే రెండు మైక్ సెట్‌లు, రెండు కార్డులెస్ ఫోన్లు, ఇతర పరికరాలను గురువారం హెచ్ఎం జి.మల్లికార్జునరావుకు అందజేశారు.